ప్రజాశక్తి
మంగళవారం 24 సెప్టెంబర్ 2024
5
విజయనగరం



జెఎన్‌టియు విసికి అవార్డు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఇంజినీరింగ్ విద్యా రంగంలో చేసిన అసాధారణ కృషికి గుర్తింపుగా జవహర్‌లాల్ నెహ్రూ టెక్నలాజికల్ యూనివర్సిటీ గురజాడ విజయనగరం (ఇన్ ఛార్జి) వైస్ - ఛాన్సలర్ ప్రొఫెసర్ డి.రాజ్యలక్ష్మికి కౌన్సిల్ ఫర్ స్కిల్స్ అండ్ కంపిటెన్సీస్ (సిఎస్‌సి ఇండియా) వారు 'అవుట్ స్టాండింగ్ లీడర్‌షిప్ లెగసీ అవార్డు' ను ప్రదానం చేశారు. ఇంజినీర్ల దినోత్సవం సందర్భంగా జరిగిన ఉత్సవంలో వర్చువల్‌గా ప్రదానం చేసారు. ఈ సందర్భంగా సిఎస్‌సి ఇండియా సీనియర్ లెర్నింగ్ కన్సల్టెంట్ వై.రామ్మోహనరావు మాట్లాడుతూ, ప్రొఫెసర్ డి.రాజ్యలక్ష్మి దార్శనికత, ఇంజినీరింగ్ విద్యా రంగంలో ఆమె చేసిన దీర్ఘకాలిక కృషిని ప్రశంసించారు. అవార్డు అందుకున్న విసిని ప్రొఫెసర్ డి.రాజ్యలక్ష్మిని యూనివర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ జి.జయసుమ, డైరెక్టర్లు, కళాశాల ఇన్ ఛార్జి ప్రిన్సిపాల్, వైస్-ప్రిన్సిపాల్, వివిధ విభాగాల అధిపతులు అభినందించారు.

కలెక్టరేట్‌ను ముట్టడించిన కానిస్టేబుల్ అభ్యర్థులు

కదంతొక్కిన కానిస్టేబుల్ అభ్యర్థులు

డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో ర్యాలీ ● కలెక్టరేట్ ఎదుట రాస్తారోకో

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ప్రిలిమినరీ పరీక్షల్లో అర్హత సాధించిన పోలీస్ కానిస్టేబుల్ అభ్యర్థులకు మెయిన్ పరీక్ష, ఈవెంట్స్ నిర్వహించాలని, ప్రభుత్వం జోక్యం చేసుకుని సుప్రీంకోర్టులో ఉన్న కేసును క్లియర్ చేయించాలని డిమాండ్ చేస్తూ సోమవారం డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో స్థానిక కోట జంక్షన్ నుంచి కలెక్టరేట్ వరకు వేలాదిమంది పోలీస్ కానిస్టేబుల్ అభ్యర్థులు ర్యాలీ నిర్వహించారు. అనంతరం కలెక్టరేట్ ఎదుట బైఠాయించారు. గంట పాటు కలెక్టరేట్ ప్రధాన గేటు వద్ద బయట బైఠాయించినా అధికారులు, కలెక్టర్ బయటకు రాకపోవడంతో ప్రధాన రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. దీంతో పోలీసు అధికారులు, సిబ్బంది అధిక సంఖ్యలో అక్కడికి చేరుకొని ట్రాఫిక్‌ను దారి మళ్లించారు. అనంతరం బైఠాయించిన అభ్యర్థులు, డివైఎఫ్ఐ నాయకులతో డిఎస్‌పి మాట్లాడి కలెక్టర్ వద్దకు తీసుకెళ్లి వినతి పత్రం అందజేశారు. అంతకు ముందు కార్యక్రమాన్ని ఉద్దేశించి డివైఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షులు యుఎస్ ఎన్ రాజు మాట్లాడుతూ పోలీస్ కానిస్టేబుల్ పోస్టుల భర్తీ కి నోటిఫికేషన్ 2022లో ఇచ్చి మూడేళ్ల అవుతున్నా ఇంకా మెయిన్ పరీక్ష, ఈవెంట్స్ నిర్వహించకపోవడం దారుణమన్నారు. రాష్ట్రంలో 6100 కానిస్టేబుల్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ ఇస్తే 95వేల మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు. ప్రిలిమినరీ పరీక్ష నిర్వహించారని, ఉత్తీర్ణులైన వారికి మెయిన్ పరీక్ష, ఈవెంట్స్ నేటి వరకు నిర్వహించలేదన్నారు. ఎన్నేళ్ళు ఉద్యోగాల కోసం అభ్యర్థులు వేచి చూడాలని ప్రశ్నించారు. రాష్ట్రంలో ప్రభుత్వాలు మారాయి తప్ప మా పోస్టులు భర్తీ చేయకపోవడం దారుణమన్నారు. సుప్రీం కోర్టులో కేసు ఉందని చెప్పి ఏళ్ల తరబడి పోస్టులు భర్తీ చేయకుండా అభ్యర్థులతో ఆడుకోవడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. వెంటనే రాష్ట్ర ప్రభుత్వం సుప్రీం కోర్టులో ఉన్న కేసును క్లియర్ చేసి మెయిన్ పరీక్ష, ఈవెంట్స్ నిర్వహించాలని డిమాండ్ చేశారు. లేదంటే ఉద్యమాన్ని మరింత తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. అనంతరం కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో డివైఎఫ్ఐ జిల్లా కన్వీనర్ హరీష్, నాయకులు సతీష్, కానిస్టేబుల్ అభ్యర్థులు పాల్గొన్నారు.

ఎండుతున్న వరి

ప్రజాశక్తి-విజయనగరం ప్రతినిధి / సంతకవిటి

23 వేల ఎకరాలకు సాగునీరు అందించే లక్ష్యంతో మడ్డువలస జలాశయాన్ని 1977లో నిర్మించారు. 2022 నాటికి పూర్తయ్యింది. అప్పట్లో చివరి ఆయుకట్టు వరకు నీరు అందేంది. నీరు పుష్కలంగా ఉండడంతో పంటలు నమ్మకంగా పండేవి. కాల క్రమంగా మారిన ప్రభుత్వాలన్నీ కాలువల నిర్వహణ గాలికి వదిలేశాయి. దీంతో, సంతకవిటి మండలంలోని అప్పలగ్రహారం, శేషాద్రిపురం, బలరాంపేట, మంతిని, సిరిపురం, చిన్న సిరిపురం, జానకీపురం, గెడ్డవలసఅగ్రహారం, రంగ నాథపేట, గోకర్ణపల్లి తదితర గ్రామాలకు సాగునీరు అండడం లేదు. సుమారు పదివేల ఎకరాలకు చుక్కనీరు అందడం లేదని రైతులు చెబుతున్నారు. దీంతో, వర్షపునీటితో ఎంతో కష్టబడి ఉబాలు పట్టినా సకాలంలో తగిన నీరు అందక ఏటా నష్టాల భారిన పడుతున్నారు. ఈ ఏడాది కూడా అదే పరిస్థితి ఎదురవ్వడంతో నాట్లు ఎండిపోయాయి. ఈ విషయాన్ని సంబంధిత నీటిపారుదల శాఖ అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా తాత్సారం చేస్తున్నారు తప్పా.. తమకు నీరు అందించే విధంగా సహకరించటం లేదని రైతులు కలత చెందుతున్నారు.

రెల్లి గెడ్డ నీటితో సిరిపురం, మండాకురిటికి చెంది న పెద్ద చెరువులు నిండిన ప్పటికీ ఈ పెద్ద గ్రామాలకు చెందిన ఎగువ భూములన్నీ మడ్డువలస జలాశయం నీటిపైనే ఆధారపడి వున్నాయి. ఈ నేపథ్యంలో నీరు అందకపోవటం, నాయకులు, అధికారులు సరైన రీతిలో స్పందించక పోవటం ఈ ప్రాంత పంటలకు ప్రాణ సంకటంగా మారిందనే ఆవేదన చెందుతున్నారు. చెరువుల నుండి, అక్కడక్కడ బోరు బావుల నుంచి యంత్రాలతో నీరు తోడించి భూములు తడిపే దౌర్భాగ్య స్థితి నెలకొందని ఆయకట్టు రైతులు చెబుతున్నారు. యంత్రాలతో పొలాలకు నీరు మళ్లించాల్సి రావటంతో మదుపులు అధికమైపోతున్నాయని రైతు కుటుంబాలు కలత చెందుతున్నాయి. వాస్తవానికి ఇటీవల కురిసిన వర్షాలకు జలాశయం పూర్తిగా నిండిపోయింది. ప్రమాద హెచ్చరికలతో సాక్షాత్తు జిల్లా కలెక్టరేట్ గేట్ల ఎత్తివేతకు ఆదేశాలు జారీచేశారు. ఇంతలా పుష్కలంగా నీరు ఉన్నప్పటికీ కాలువల్లో చుక్కనీరు లేకపోవడం గమనార్హం.

ఈ ఏడాది మరీ ఘోరంగా నష్టపోయే పరిస్థితి రావడంతో అధికారులు, ప్రజాప్రతినిధుల చుట్టూ కాళ్లు అరిగేలా తిరుగుతున్నారు. కావల్లో కనీసం పూడికలు తీయకపోవటం, ఎక్కడికక్కడ పిచ్చి మొక్కలు చెట్లుగా ఎదిగిపోవటం అధికారుల తీరుకు అద్దం పడుతోంది. ఈ నేపథ్యంలో తమ సమస్యను పరిష్కరి ంచాలంటూ రైతులు పోరుబాట పట్టారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజాసమస్యల పరిష్కార వేదికలో కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. అంతకు ముందుకు కలెక్టర్ ఎదుట ప్రభుత్వ తీరుకు వ్యతిరేకంగా ధర్నా చేపట్టారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు కలుగ చేసుకొని మడ్డువలస జలాశయం నీరు శివారు గ్రామాలకు అందించకపోతే తీవ్ర స్థాయిలో నిరసన వ్యక్తం చేస్తామని రైతులు చెబుతున్నారు.

పేరు గొప్ప, ఊరు దిబ్బ అనే చందంగా వుంది ఆ గ్రామాల రైతుల దుస్థితి. తామంతా మడ్డువలస జలాశయం ఆయకట్టు రైతులమని గొప్పలు చెప్పుకోవటానికే తప్పా.. చుక్క నీటికైనా నోచుకోవటం లేదని సంతకవిటి మండలంలోని పలు గ్రామాల రైతులు ఆవేదన దిగమింగుతున్నారు. పచ్చని పైరుతో కళకళలాడాల్సిన బంగారం లాంటి భూములు ఎందుకూ పనికి రాని బీడు భూములుగా మారుతున్నాయంటూ బాధిత రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఎండిపోతున్న వరి పొలం

మడ్డువలస శివారు భూములకు అందని నీరు

కాలువల నిర్వహణ గాలికి వదిలేయడమే కారణం

మండలంలోని పది గ్రామాలకు పైగా సుమారు 1500 ఎకరాల భూమి బీడు భూముగా మారిపోతుందని రైతులు బాధపడుతున్నారు.

6 వేల ఎకరాలకు సాగునీరు లేదు

సంతకవిటి మండల పరిధిలో సుమారు 6వేల ఎకరాలకు సాగునీరు అందడం లేదు. మడ్డువలస జలాశయంలో పుష్కలంగా నీరు ఉన్నప్పటికీ కాలువల నిర్వహణ పాలకులు పూర్తిగా గాలికి వదిలేయడమే ఇందుకు కారణం. ఒకప్పుడు మాప్రాంతం పచ్చటి పైరుతో కళకళలాడేది. కొన్నేళ్లగా బీడు భూములుగా మారిపోయాయి. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందిచాలి.

- అదపాక అచ్చుతరావు, సిరిపురం గ్రామం

ఐదెకరాల్లో పంట ఎండిపోయింది

నీటి ఎద్దడి కారణంగా నాకున్న ఐదెకరాల్లో ఎద జల్లాను. పది రోజుల క్రితం కురిసిన వర్షాలకు మడ్డువలస జలాశయం నిండిపోవడంతో ఎంతోకొంత నీరు వస్తుందని ఆశించాను. జలాశయం పొంగిపొర్లినా, గేట్లు ఎంతేయాల్సిన పరిస్థితి ఏర్పడినా మాకు చుక్కనీరు రాలేదు. ముమ్మాటికీ ప్రభుత్వ వైఫల్యమే ఇది. ఐదెకరాల్లోనూ నష్టపోయే పరిస్థితి కనిపిస్తోంది.

- పప్పల ఈశ్వరరావు, జిఎన్‌పురం గ్రామం

అమ్మవారి పండగకు ఉచిత దర్శనం

విజయనగరం టౌన్ : పైడితల్లి అమ్మవారి సిరిమానోత్సవాన్ని రాష్ట్ర పండుగగా గుర్తించిన నేపథ్యంలో అక్టోబర్ 14,15 తేదీల్లో జరిగే తొల్లేళ ఉత్సవం, సిరిమానోత్సవం పూర్తయ్యే వరకు భక్తులకు ఉచిత దర్శనం కల్పించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిందని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. సిరిమానోత్సవం సందర్భంగా అమ్మవారి చదురుగుడి, వనంగుడి దేవాలయాలకు భక్తులు తాకిడి అధికంగా ఉండే దృష్ట్యా ఈ నిర్ణయం తీసుకుందని తెలిపారు. గతంలో రూ.100, రూ.300, రూ.50 చొప్పున టిక్కెట్లను విక్రయించడం ద్వారా ఆలయానికి సుమారుగా రూ.15 లక్షలు ఆదాయం వచ్చేదని తెలిపారు.

పట్టువస్త్రాలు సమర్పించనున్న కొండపల్లి

పైడితల్లమ్మ సిరిమానోత్సవం సందర్భంగా అక్టోబర్ 15న రాష్ట్ర ప్రభుత్వం తరపున మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించనున్నారు. ఈ మేరకు మంత్రి శ్రీనివాస్‌ను నియమిస్తూ రాష్ట్ర దేవాదాయ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎస్.సత్యనారాయణ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. జిల్లా కలెక్టర్ బి.ఆర్.అంబేద్కర్ ఈ విషయాన్ని వెల్లడించారు. ప్రభుత్వం ఇప్పటికే పైడితల్లమ్మ జాతరను ప్రభుత్వ పండుగగా ప్రకటించిన విషయం తెలిసిందే.

శరత్‌చంద్రకు పలువురి నివాళి

ప్రజాశక్తి-గజపతినగరం

మాజీ మంత్రి పడాల అరుణ కుమారుడు పడాల శరత్‌చంద్ర మృతికి పలువురు నాయకులు నివాళులర్పించారు. ఆదివారం రాత్రి గుండెపోటుతో హఠాన్మరణం చెందిన శరత్‌చంద్ర అంత్యక్రియలు సోమవారం జరిగాయి. అంతకుముందు ఆయన మృతదేహాన్ని ప్రజలు, నాయకులు, కార్యకర్తల సందర్శనార్థం వారి స్వగృహం వద్ద ఉంచారు. కుమారుడి మృతదేహం వద్ద అరుణ బోరున విలపించడం అందరినీ కలచి వేసింది. వైసిపి శాసనమండలి ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణ, మంత్రి గుమ్మడి సంధ్యారాణి, నెల్లిమర్ల ఎమ్మెల్యే లోకం మాధవి, మాజీ ఎమ్మెల్యేలు బొత్స అప్పలనరసయ్య, కెఎ నాయుడు, శోభ హైమావతి, మాజీ ఎంపిపి లు కొండపల్లి కొండలరావు, మక్కువ శ్రీధర్, గంట్యాడ శ్రీదేవి, కంది తిరుపతి నాయుడు, జెడ్‌పిటిసిలు గార తవుడు, వర్రి నరసింహమూర్తి, టిడిపి రాష్ట్ర నాయకులు కరణం శివరామకృష్ణ, పివివి .గోపాలరాజు తదితరులు శరత్‌చంద్రకు నివాళులర్పించారు పడాల అరుణను పరామర్శించి ఓదార్చారు. అనంతరం కన్నీటి వీడ్కోలు నడుమ అంతిమయాత్ర నిర్వహించారు. శరత్ మృతికి మంత్రి కొండపల్లి శ్రీనివాస్ ఒక ప్రకటనలో సంతాపం తెలిపారు.

పరిహారానికి అర్హుల జాబితాలు ప్రదర్శించండి

- ఇళ్లు దెబ్బతిన్న వారికి 25న పరిహారం జమ
- మరో రెండు వారాలు భారీవర్షాలు కురిసే అవకాశం
- మండల, జిల్లా స్థాయి అధికారులు అప్రమత్తం : కలెక్టర్

ప్రజాశక్తి-విజయనగరం కోట

జిల్లాలో ఇటీవల భారీవర్షాలకు ఇళ్లు దెబ్బతిని పరిహారం పొందేందుకు అర్హులైన వారి జాబితాలను సోమ, మంగళవారాల్లో ఆయా గ్రామ, వార్డు సచివాలయాల్లో ప్రదర్శించి దీనిపై ఎవరికైనా అభ్యంతరాలుంటే వాటిని స్వీకరించి నివేదించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ తహశీల్దార్‌లను ఆదేశించారు. జిల్లాలోని 20 మండలాల పరిధిలో 66 ఇళ్లు దెబ్బతిన్నాయని, వాటికి పరిహారం అందించాలని తహశీల్దార్‌ల నుంచి నివేదికలు అందాయని తెలిపారు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజాసమస్యల పరిష్కారవేదిక కార్యక్రమం నుంచి మండల తహశీల్దార్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఇళ్ల పరిహారాన్ని సెప్టెంబరు 25న బాధితుల బ్యాంకు ఖాతాల్లో జమచేస్తామన్నారు. పంటనష్టం వివరాలకు సంబంధించి కూడా రైతుల నుంచి ఏవైనా అభ్యంతరాలుంటే స్వీకరించాలన్నారు.

జిల్లాలో వచ్చే రెండు వారాలపాటు జిల్లాలో భారీవర్షాలు కురిసే అవకాశం వుందని, అన్ని మండలాల తహశీల్దార్లు, నోడల్ అధికారులు అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. వాగులు, గెడ్డల్లో నీటి ప్రవాహం అధికంగా ఉన్న చోట్ల ప్రజలను అప్రమత్తం చేయాలన్నారు. ప్రజాసమస్యల పరిష్కార వేదికలో పలువురు ఫించన్ల మంజూరుకోసం వినతులు అందించగా దీనిపై కలెక్టర్ స్పందిస్తూ అర్హులైన వారికి ప్రభుత్వం కొత్త ఫించన్లు మంజూరు చేసిన వెంటనే అందిస్తామని తెలిపారు.

పొలం పిలుస్తోంది పోస్టర్ల ఆవిష్కరణ

వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో రూపొందించిన పొలం పిలుస్తోంది పోస్టర్లను కలెక్టర్ డా.బి.ఆర్.అంబేద్కర్, జాయింట్ కలెక్టర్ ఎస్.సేతుమాధవన్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా వ్యవసాయ అధికారి వి.టి.రామారావు మాట్లాడుతూ ప్రతి మంగళ, బుధవారాల్లో రెండు రోజులపాటు వ్యవసాయ సిబ్బంది రోజుకు రెండు గ్రామాల్లో పర్యటించి అధునాతన సాగు పద్ధతులపై రైతులకు ఈ కార్యక్రమం ద్వారా వివరిస్తారని పేర్కొన్నారు. కార్యక్రమంలోడిఆర్ఒ ఎస్.డి.అనిత, ఉద్యానశాఖ డి.డి. జమదగ్ని, ఓపిఎంఐపి పీడీ లక్ష్మీనారాయణ, మార్కెటింగ్‌శాఖ ఎడి బి.రవికిరణ్, తదితరులు పాల్గొన్నారు.

అర్జీలను పరిశీలిస్తున్న కలెక్టర్ అంబేద్కర్

గ్రీవెన్స్‌కు 294 వినతులు

కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజాసమస్యల పరిష్కార వేదికకు సోమవారం 294 వినతులు అందాయి. జిల్లా కలెక్టర్ బిఆర్ అంబేద్కర్, జాయింట్ కలెక్టర్ ఎస్.సేతుమాధవన్, డిఆర్ఒ ఎస్.డి.అనిత తదితరులు ప్రజల నుంచి వినతులు స్వీకరించి వాటి పరిష్కారానికి జిల్లా అధికారులకు ఆదేశాలిచ్చారు. మండల స్థాయిలో పరిష్కారం కావాల్సిన పలు వినతులపై జిల్లా కలెక్టర్ నేరుగా ఆయా మండలాల తహశీల్దార్లతో వీడియో కాన్ఫరెన్సు ద్వారా మాట్లాడి వినతులు పరిష్కరించాలని ఆదేశించారు. అత్యధికంగా రెవిన్యూ శాఖకు 227, డిఆర్‌డిఎకు 24, పంచాయతీరాజ్ శాఖకు 10, గృహనిర్మాణ సంస్థకు 9, విద్యుత్తుశాఖ, విద్యాశాఖలకు 7 చొప్పున, వైద్య ఆరోగ్య శాఖకు 6, గ్రామవార్డు సచివాలయాలు, ఆసుపత్రుల సమన్వయాధికారికి 2 చొప్పున వినతులు అందాయి. సంతకవిటి మండలం సిరిపురం గ్రామానికి చెందిన పలువురు రైతులు తమకు మడ్డువలస కాల్వ ద్వారా సాగునీరు సక్రమంగా అందడం లేదని పేర్కొంటూ కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు.

భారీగా బదిలీలు

ప్రజాశక్తి-విజయనగరం ప్రతినిధి/ టౌన్

జిల్లాలో పలువురు అధికారులకు బదిలీ అయ్యింది. వారి స్థానాల్లో కొత్తవారు నియమితులయ్యారు.

డిపిఒగా టి.వెంకటేశ్వరరావు

జిల్లా పంచాయతీ అధికారిగా టి.వెంకటేశ్వరరావు నియమితులయ్యారు. ఆయన శ్రీకాకుళం డిపిఒగా విధులు నిర్వహిస్తూ ఇక్కడికి బదిలీ అయ్యారు. గతంలో జెపి సిఇఒగా పనిచేశారు. ఇక్కడ డిపిఒగా పనిచేసిన శ్రీధర్‌రాజాను శ్రీకాకుళం జెడ్‌పి సిఇఒగా బదిలీ చేశారు. డిప్యూటీ సిఇఒ రాజ్‌కుమార్‌ను విశాఖ డిప్యూటీ సిఇఒగా నియమించారు. శ్రీకాకుళం డిప్యూటీ సిఇఒ వెంకటరమణ ఇక్కడికి రానున్నారు. జెడ్‌పి సిఇఒగా డ్వామా ఎఒ సత్యనారాయణ నియమితులయ్యారు.

డ్వామా పీడీగా సందీప్

డ్వామా పీడీ ఉమాపరమేశ్వరి బదిలీ కావడంతో ఆమె స్థానంలో విశాఖ జిల్లాకు చెందిన డ్వామా పీడీ సందీప్ నియమి తులయ్యారు. ఇక్కడ డ్వామా ఎపిఒ అరుణశ్రీ పశ్చిమగోదావరి జిల్లాకు బదిలీ అయ్యారు. చీపురుపల్లి డ్వామా ఎపిడి లక్ష్మణరావు తూర్పుగోదావరి జిల్లా డ్వామా పీడీగా నియమితులయ్యారు.

ల్యాండ్స్ అండ్ సర్వే అసిస్టెంట్ డైరెక్టర్ త్రివిక్రమరావు ఎన్‌టిఆర్ జిల్లాకు బదిలీ అయ్యారు.

సివిల్ సప్లయి డిఎం మీనాకుమారి రాష్ట్ర కేంద్రానికి బదిలీ అయ్యారు. ఆమె స్థానంలో ఇంకా ఎవరూ నియమితులు కాలేదు. స్కిల్ డెవలప్‌మెంట్ మేనేజర్ గోవిందరావు అనకాపల్లి జిల్లాకు బదిలీ అయ్యారు. అల్లూరి సీతారామరాజు జిల్లా మేనేజర్ ఇక్కడికి వస్తున్నట్లు తెలిసింది.

టౌన్‌ప్లానింగ్ ఎసిపిలకు బదిలీ

నగరపాలక సంస్థ కార్యాలయంలో టౌన్ ప్లానింగ్ అధికారులకు, సిబ్బందికి బదిలీ అయ్యింది. ఈ మేరకు టౌన్ ప్లానింగ్ డైరెక్టర్ కార్యాలయం నుంచి ఉత్తర్వులు వెలువడ్డాయి. టౌన్ ప్లానింగ్ ఎసిపిలు సిహెచ్ మధుసూదనరావుకు విశాఖపట్నం, అమ్మాజీరావు విఎంఆర్‌డిఎకు, టిపిఒ ఫిలిప్‌ను బొబ్బిలి మున్సిపాలిటీకి బదిలీ చేశారు.

ఎసిపిలుగా హరిబాబు,రమణమూర్తి

బదిలీ అయిన ఎసిపిల స్థానంలో రాజమండ్రి నగర పాలక సంస్థ నుంచి ఎన్.హరిబాబును, మధుసూదనరావు స్థానంలో శ్రీకాకుళం నగరపాలక సంస్థ నుంచి అమ్మాజీరావును నియమించారు. టిపిఒగా కాశీబుగ్గ టిపిఒ ఎన్.అప్పలరాజు రానున్నారు. టిపిఎస్ గా విశాఖ జివిఎంఎఇ నుంచి సి.అనిత రానున్నారు. పబ్లిక్ హెల్త్ ఇఇగా టిడ్కో ఇఇ ఎస్.జ్యోతి నియమితులయ్యారు.

ఎంఇగా రాయలబాబు

విజయనగరం కార్పొరేషన్ మున్సిపల్ ఇంజినీర్‌గా టి. రాయలబాబు రానున్నారు. ఆయన విశాఖలో ఇఇగా చేస్తూ ఇక్కడికి బదిలీ అయ్యారు. ఇక్కడ పనిచేసిన కె.దక్షిణామూర్తి శ్రీకాకుళం ఎంఇగా బదిలీ అయ్యారు.

ఇందిరమ్మకాలనీలో ఆక్రమణలపై దర్యాప్తు

ప్రజాశక్తి-బొబ్బిలి

ఇందిరమ్మ కాలనీలో ఆక్రమణలపై తహశీల్దార్ ఎం.శ్రీను సోమవారం దర్యాప్తు చేశారు. కాలనీలో ప్రభుత్వ స్థలాలను ఆక్రమించి నిర్మాణాలు చేస్తున్నట్లు ఫిర్యాదు రావడంతో దర్యాప్తు చేసినట్లు తహశీల్దార్ చెప్పారు. పట్టాలు లేకుండా నిర్మాణాలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆక్రమణలు జరగకుండా నిఘా పెట్టాలని ఆర్ఐ కళ్యాణ్ చక్రవర్తిని ఆదేశించారు.

లేబర్ కోడ్‌లు రద్దు చేయాలని

కలెక్టరేట్ వద్ద కార్మికులు నిరసన

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

కలెక్టరేట్ వద్ద నిరసన తెలుపుతున్న సిఐటియు నాయకులు, కార్మికులు

కార్మిక హక్కులను, రక్షణను హరించే లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ సిఐటియు ఆధ్వర్యాన కార్మికులు సోమవారం బ్లాక్‌డే పాటించారు. ఈ సందర్భంగా కలెక్టరేట్ వద్ద నిరసన తెలిపారు. కార్యక్రమాన్ని ఉద్దేశించి సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కె.సురేష్ మాట్లాడుతూ నరేంద్ర మోడీ ప్రభుత్వం 44 కార్మిక చట్టాలను రద్దుచేసి నాలుగు లేబర్ కోడ్‌లుగా మార్పు చేసి కరోనా కాలంలో పార్లమెంట్‌లో ఆమోదం చేసి వాటిని అమలు చేయడానికి ప్రయత్నం చేస్తుందన్నారు. దీన్ని నిరసిస్తూ దేశవ్యాప్తంగా కార్మిక వర్గం బ్లాక్ డేగా ప్రకటించిందన్నారు. కార్మికులకు రక్షణగా ఉన్న కార్మిక చట్టాలను అమలు చేయని యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలన్నారు. కార్మికులకు కనీస వేతనం, పిఎఫ్ ఇఎస్ఐ, వంటి సౌకర్యాలు కల్పించకుండా, కార్మికులను కట్టు బానిసలుగా మార్చేందుకు కార్మికుల శ్రమను దోచి పెట్టే విధంగా ఈ లేబర్ కోడ్‌లు ఉపయోగ పడతాయన్నారు. కావున లేబర్‌కోడ్‌లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిఐటియు నగర అధ్యక్ష కార్యదర్శులు ఎ.జగన్మోహన్, బి.రమణ, కార్మికులు సూర్య నారాయణ, రాము, నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా క్రీడా పోటీలు

విజయనగరం టౌన్ : విజయనగరం నియోజకవర్గం స్కూల్ గేమ్స్ పోటీలు ఉత్సాహంగా సాగాయి. సోమవారం స్థానిక విజ్జి స్టేడియంలో జరిగిన స్కూల్ గేమ్స్ పోటీల్లో వాలీబాల్, కబడ్డీ, ఖో ఖో, చదరంగం, యోగా పోటీలు నిర్వహించారు. పోటీలను నియోజకవర్గ తెలుగుదేశం నాయకులు ఐవిపి రాజు, కార్పొరేటర్ గాదం మురళీ ప్రారంబించారు. స్కూల్ గేమ్స్ కార్యదర్శి కృష్ణంరాజు మాట్లాడుతూ జిల్లాలో అన్ని నియోజకవర్గ స్థాయిలో జరిగిన పోటీల్లో విజేతలైన వారు జిల్లా పోటీలకు ఎంపికవుతారని తెలిపారు. ప్రతిభ ఆధారంగానే జిల్లా పోటీలకు ఎంపిక చేస్తామన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ ఇన్చార్జి తవుడు బాబు, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అండర్-19 స్కూల్ గేమ్స్ కార్యవర్గం ఎన్నిక

జిల్లా వృత్తి విద్యా శాఖ అధికారి ఎస్.భీమా శంకరరావు ఆధ్వర్యంలో డివిఒఒ కార్యాలయంలో అండర్ 19 స్కూలు గేమ్స్ కార్యవర్గం ఎన్నిక జరిగింది. అధ్యక్షులుగా భీమా శంకరరావు, కార్యదర్శిగా కృష్ణ, సలహాదారుగా మన్యం జిల్లా డివిఇఒ మంజుల వీణ, వినోద్ బాబు, సహాయ కార్యదర్శి గా ఉమామహేశ్వరరావు ఎన్నికయ్యారు. సమావేశంలో గురుకుల పాఠశాలలు, కళాశాలలు, ప్రభుత్వ జూనియర్ కళాశాలల వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బాధితుల సమస్యలను పరిష్కరించాలి

ప్రజాశక్తి -విజయనగరం కోట

అర్జీదారులతో మాట్లాడుతున్న ఎస్‌పి వకుల్ జిందాల్

బాధితుల సమస్యలను తక్షణమే పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని పోలీసు అధికారులను ఎస్‌పి వకుల్ జిందాల్ ఆదేశించారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించారు. ప్రజల నుంచి 81 ఫిర్యాదులు స్వీకరించి, వారి సమస్యలను విన్నారు. అనంతరం సంబంధిత పోలీసు అధికారులతో వీడియో కాన్ఫరెన్సులో మాట్లాడి, ఫిర్యాదుదారుల సమస్యలను సంబంధిత అధికారులకు వివరించారు. స్వీకరించిన ఫిర్యాదుల్లో భూతగాదాలకు సంబంధించినవి 23, కుటుంబ కలహాలకు సంబంధించి 7 ఫిర్యాదులు, మోసాలకు పాల్పడినట్లుగా 17 ఫిర్యాదులు, ఇతర విషయాలకు సంబంధించినవి 34 ఫిర్యాదులు ఉన్నాయన్నారు. ఫిర్యాదులపై తక్షణమే స్పందించి, విచారణ చేపట్టి, ఏడు రోజుల్లో పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. డిఎస్‌పిలు ఎం.శ్రీనివాసరావు, యూనివర్స్, ఎస్‌బి సిఐ ఎ.లీలారావు, డిసిఆర్‌బి ఎస్ఐ ఆర్. వాసుదేవ్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌పిని కలిసిన చీపురుపల్లి డిఎస్‌పి

చీపురుపల్లి డిఎస్‌పి ఎస్.రాఘవులు బాధ్యతలు చేపట్టి సోమవారం ఎస్‌పి వకుల్ జిందాల్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. సబ్ డివిజన్ పరిధిలో ఎటువంటి శాంతిభద్రతల సమస్యలు ఉత్పన్నం కాకుండా సమర్ధవంతంగా పని చేయాలని, ప్రతీ రోజూ సబ్ డివిజన్ పరిధిలో విజిబుల్ పోలీసింగ్ నిర్వహించాలని, గంజాయి నియంత్రణకు చర్యలు చేపట్టాలని ఈ సందర్భంగా ఎస్‌పి ఆదేశించారు.

ఫోర్టుసిటీ విద్యార్థుల ప్రతిభ

విజయనగరంటౌన్ : అటల్ టింకరింగ్ ల్యాబ్‌లున్న స్కూళ్లకు 'భారత్ టెక్ లీగ్ ' పోటీలు నాలుగు అంశాలలో మూడు స్థాయిల్లో నిర్వహించారు. ఈ పోటీల్లో ఆంధ్రప్రదేశ్ తెలంగాణా, హిమాచల్ ప్రదేశ్ రాష్ట్రాల నుంచి 150 పాఠశాలలకు చెందిన సుమారు 600 మంది విద్యార్థులు పాల్గొన్నారు. మొదటి, రెండవ స్థాయిల్లో ప్రతిభ కనబర్చిన ఫోర్టుసిటీ పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న విద్యార్థులు శ్యామ్ మనోహర్, డి. సాయి పార్థ సారథి, మెహర్ శ్రీ తరుణ్ 'రోబోటిక్స్' అంశంలో ప్రతిభ అనబరిచి ప్రథమస్థానాన్ని కైవసం చేసుకున్నారు. డ్రోన్ టెక్నాలజీ విభాగంలో ఎం డి. రెహన్, బి. ఉదయ్ కుమార్, ఎం. తేజ ద్వితీయ స్థానాన్ని సాంధించారు. విద్యార్థులను పాఠశాల చైర్మన్ కెపి రాజు(శివ), వైస్ చైర్మన్ చంటి, ప్రిన్సిపల్ డాక్టర్ రీయినా ఖాన్, డైరెక్టర్లు మధు, అశోక్, నీలిమా తదితరులు అభినందించారు.

ఎన్‌టిఆర్ స్మార్ట్ టౌన్‌షిప్ లేఅవుట్‌లో

ఇళ్ల స్థలాల కేటాయింపు

ప్రజాశక్తి-విజయనగరం కోట

డెంకాడ మండలం రఘుమండ వద్ద విఎంఆర్‌డిఎ అభివృద్ధి చేసిన ఎన్‌టిఆర్ స్మార్ట్ టౌన్‌షిప్ లేఔట్‌లో మిగిలిన 44 ఎంఐజి ఇళ్ల స్థలాల కోసం కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం ఈ-లాటరీ ప్రక్రియను నిర్వహించారు. జాయింట్ కలెక్టర్ ఎస్.సేతు మాధవన్, డిఆర్ఒ ఎస్‌డి అనిత సమక్షంలో కంప్యూటర్ ద్వారా లాటరీ నిర్వహించి స్థలాలను కేటాయించారు. లాటరీ విజేతలకు ప్లాటు కేటాయింపు పత్రాలను అందజేసి, జెసి వారిని అభినందించారు. ఈ సందర్భంగా విఎంఆర్‌డిఎ ప్లానింగ్ ఆఫీసర్ కె.వెంకటేశ్వర్రావు మాట్లాడుతూ, మధ్యతరగతి ప్రజల సౌకర్యం కోసం జిల్లాలో రఘుమండ, జియ్యన్నవలస, చీపురుపల్లిలో ఎన్టిఆర్ స్మార్ట్ టౌన్ షిప్ లేఅవుట్లను విశాఖపట్నం మహాప్రాంత అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో అభివృద్ధి చేసినట్లు తెలిపారు. రఘుమండ లేఅవుట్‌లో ఇప్పటికే 177 ప్లాట్లను కేటాయించగా, మిగిలిన 44 స్థలాల కోసం ఈ రోజు లాటరీ ప్రక్రియను నిర్వహించి ప్లాట్లను కేటాయించినట్లు తెలిపారు. ఇంకా ఈ లేఅవుట్‌లో ప్రభుత్వ పెన్షనర్ల కోసం కేటాయించిన 4 స్థలాలు మాత్రం మిగిలి ఉన్నాయని చెప్పారు. వీటి కోసం నెల్లిమర్ల నియోజకవర్గంలోని పెన్షనర్లు ఎవరైనా ధరఖాస్తు చేసుకుంటే, ప్లాట్లను కేటాయిస్తామని తెలిపారు. ప్లాటు కేటాయింపబడ్డ నెల రోజులలోపు విఎంఆర్‌డిఎకు ఒప్పందం సమర్పించాలని, ఒప్పందం జరిగిన నెలలోపు ప్లాటు ధరలో 30 శాతం, ఆరు నెలలలోపు 30 శాతం, ఏడాదిలోపు మిగిలిన మొత్తాన్ని చెల్లించాల్సి ఉంటుందని వివరించారు. ప్రభుత్వ ఉద్యోగుల కోటా కింద కేటాయించిన వారికి 20 శాతం రాయితీని ఆఖరి రెండు విడతల్లో ఒక సారికి 10శాతం చొప్పున అందిస్తామని వెంకటేశ్వర్రావు తెలిపారు. కార్యక్రమంలో విఎంఆర్‌డిఎ ప్లానింగ్ అధికారులు శ్రీనివాసమూర్తి, గోపినాథ్, సహాయ ప్లానింగ్ అధికారులు మౌనిక, నాయుడు, జెపిఒ జానకి, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

లబ్ధిదారులకు ప్లాట్ల కేటాయింపు పత్రాలను అందజేస్తున్న జెసి

స్వగ్రామాలకు మెడికోల మృతదేహాలు

ప్రజాశక్తి-బొబ్బిలి

అల్లూరి సీతారామరాజు జిల్లా మారేడుమిల్లి జలతరంగిణి జలపాతంలో కొట్టుకుపోయిన ఇద్దరు మెడికల్ విద్యార్థుల మృతదేహాలు స్వగ్రామాలకు సోమవారం చేరుకున్నాయి. ఏలూరులో ఎంబిబిఎస్ చదువుతున్న ముగ్గురు విద్యార్థులు విహారయాత్రకు వెళ్లి, జలపాతంలో ఆదివారం గల్లంతైన విషయం తెలిసిందే. అందులో బొబ్బిలి పట్టణంలోని రావువారివీధికి చెందిన కొసిరెడ్డి సౌమ్య, బాడంగి మండలంలో డొంకినవలస రైల్వేస్టేషన్‌కు చెందిన బాలి అమృత మరణించారు. వీరి మృతదేహాలు సోమవారం లభ్యం కావడంతో పోస్టుమార్టం అనంతరం ఆయా కుటుంబ సభ్యులు సొంత గ్రామాలకు తీసుకువచ్చారు. దీంతో ఆయా ప్రాంతాల్లో విషాదఛాయలు అలుముకున్నాయి. మృతదేహాలను చూసిన కుటుంబ సభ్యులు, బంధువులు గుండెలవిసేలా రోధిస్తున్నారు.



అమృత మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబ సభ్యులు, బంధువులు

రైతు సమస్యలపై నిరసనలు

వైద్యపరీక్షలు చేయించుకుంటున్న ఎమ్మెల్యే బేబినాయన

వైద్య రంగానికి పెద్దపీట : ఎమ్మెల్యే

ప్రజాశక్తి-బొబ్బిలి

ప్రభుత్వం వైద్య రంగానికి పెద్దపీట వేస్తుందని ఎమ్మెల్యే బేబినాయన అన్నారు. స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో సోమవారం పారిశుధ్య కార్మికుల కోసం ఏర్పాటుచేసిన ఉచిత వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ వైద్యంపై ప్రజలకు నమ్మకం కలిగేలా సేవలు అందించాలని వైద్యులకు సూచించారు. ప్రభుత్వ ఆసుపత్రిని 100 పడకల ఆసుపత్రిగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తామన్నారు. ఈ సందర్భంగా బేబినాయనకు సూపరింటెండెంట్ గేదెల శశిభూషణరావు వైద్య పరీక్షలు చేశారు. కార్మికులకు వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఎల్.రామలక్ష్మి, టిడిపి నాయకులు భాస్కరరావు, అప్పలనాయుడు, శ్రీధర్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

రైతులకు ఇకెవైసి తప్పనిసరి

రామభద్రపురం : రైతులు ఇకెవైసి తప్పనిసరిగా చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి వెంకయ్య తెలిపారు. స్థానిక వ్యవసాయ కార్యాలయంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఇప్పటికే 15,649 ఎకరాల్లో ఇ-పంట నమోదు కార్యక్రమం పూర్తి చేశామన్నారు. ఇంకా మిగిలిన రైతులు పంట నమోదు చేసుకోవాలని కోరారు. పొలం పిలుస్తోంది కార్యక్రమం ప్రతి మంగళ, బుధవారాల్లో చేపట్టనున్నామని చెప్పారు. కార్యక్రమంలో ఏఎఒ కొండలరావు, తదితరులు పాల్గొన్నారు.

రెవెన్యూ సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు

రామభద్రపురం : రెవెన్యూ సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటామని తహశీల్దార్ ఎ.సులోచనారాణి తెలిపారు. సోమవారం తహశీల్దార్ కార్యాలయంలో ఆమె విలేకరులతో మాట్లాడారు. రీసర్వే కారణంగా చాలా సమస్యలు రైతుల నుంచి వస్తున్నాయని తెలిపారు. ఆయా గ్రామాల్లోని వీఆర్ఒలు, సర్వేయర్ల ద్వారా కొన్ని పరిష్కరించామని చెప్పారు. మిగిలిన సమస్యలు త్వరలో పరిష్కరించేందుకు కార్యాచరణ చేపడతామని వెల్లడించారు.

హౌసింగ్ కార్యాలయంలో నాగుపాము

డెంకాడ : మండల కేంద్రంలోని హౌసింగ్ కార్యాలయంలో నాగుపాము సోమవారం ప్రవేశించి హల్‌చల్ చేసింది. దీంతో కార్యాలయ సిబ్బంది పరుగులు తీశారు. హౌసింగ్ సిబ్బంది రోజువారీ ఉద్యోగ నిమిత్తం రోజువారిగానే ఉదయాన్నే తలుపులు తెరిచేందుకు తాళాలు తీశారు. అప్పటికే పాము లోపల నుంచి బుసలు కొడుతూ కనిపించింది. దీంతో సిబ్బంది ఒక్కసారిగా భయాందోళనకు గురై బయటికి పరుగులు తీశారు. వెంటనే అక్కడకు చేరుకున్న కొంతమంది వ్యక్తులు పాములు కొట్టేవారిని తీసుకువచ్చి దానిని చంపేసి దహన సంస్కారాలు కూడా నిర్వహించారు.

రాష్ట్రస్థాయి త్రోబాల్ పోటీలకు బాలిక ఎంపిక

గరివిడి : విశాఖపట్నం ఇందిరా ప్రియదర్శిని మున్సిపల్ స్టేడియంలో జరిగిన రాష్ట్ర స్థాయి త్రో బాల్ అండర్ 18లో తాటిగూడ పాఠశాలకు చెందిన విద్యార్థిని సోఫియా శిరీష తృతీయ స్థానం సాధించారు. పతకంతో పాటు మెరిట్ సర్టిఫికెట్, మెడల్, పొందిన విద్యార్థిని రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైందని పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎ. సత్య శ్రీనివాసు తెలిపారు. పోటీలకు ఎంపికైన శిక్షకులు ఉపాధ్యాయ సిబ్బంది, పీడీ బి.ఎం. శ్రీకాంత్, గ్రామ పెద్దలు ఎద్ద వెంకట లక్ష్మి రమణమ్మ, శపతి సన్యాసి, యద్ద అప్పారావు స్కూల్ మేనేజ్మెంట్ కమిటీ చైర్మన్ గంటెడ సన్యాసిరావులు అభినందించారు.

వైద్య శిబిరానికి విశేష స్పందన

శృంగవరపుకోట : పట్టణంలోని సచివాలయం-2 ఆవరణలో పారిశుధ్య కార్మికుల కుటుంబాల కోసం ఏర్పాటుచేసిన వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. 56 మందికి సిహెచ్‌సి వైద్యులు లిపికా, జ్యోతిర్మయి, మధుబాబు పరీక్షలు చేశారు. మందులు అందజేశారు.

న్యాయం చేయాలని గ్రీవెన్స్‌లో ఫిర్యాదు

జామి : తమ స్థలాన్ని ఆక్రమించేందుకు కుట్ర పన్నారని, అందులో భాగంగా తమను తోటి సామాజిక తరగతి వారితోనే పంచాయతీ పెద్దలు వేధిస్తున్నారని అలమండ పంచాయతీ నారాయణపురానికి చెందిన శీర దేముడు జిల్లా కలెక్టర్‌కు, జిల్లా ఎస్‌పికి గ్రీవెన్స్‌లో సోమవారం ఫిర్యాదు చేశారు. గత ప్రభుత్వ హయాంలో ఎవరూ పట్టించుకోలేదని విలపించారు. కేవలం ఎన్నికలలో ప్రతిరోజూ పోటీ చేశామనే కారణంతో గ్రామ ఉపసర్పంచ్ తమపై కక్షగట్టారని, తమకు న్యాయం చేయాలని కోరారు.

నిధుల మంజూరుకు ప్రతిపాదనలు

వేపాడ : మండలంలోని బక్కునాయుడుపేట వల్లంపూడి ఆదర్శ పాఠశాలకు ప్రధాన గేటు లేదు. దీంతో వసతిగృహంలో ఉన్న బాలికలకు, పాఠశాల ఆవరణలో వేసిన మొక్కలకు రక్షణ లేకుండా పోయింది. ఈ నేపథ్యంలో పాఠశాల ప్రధాన గేటు, సోలార్ విద్యుత్ దీపాలు ఏర్పాటుచేయాలని కలెక్టర్ బిఆర్ అంబేద్కర్‌కు ఇటీవల సామాజిక కార్యకర్త అప్పారావు వినతి పత్రం అందించారు. దీనికి స్పందించిన కలెక్టర్ ప్రధాన గేటు ఏర్పాటుకు రూ.1.80 లక్షలు అవసరమవుతుందని, నిధులు మంజూరు చేయాలని రాష్ట్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించారు.

కొత్తపాలెం పాతచెరువుకు గండి

బొండపల్లి : మండలంలోని కొత్తపాలెం గ్రామంలో ఆదివారం రాత్రి కురిసిన భారీ వర్షానికి పాత చెరువుకు గండి పడింది. తహశీల్దార్ డి.రాజేశ్వరావు ఆధ్వర్యాన గ్రామ రెవెన్యూ అధికారులు సోమవారం గండిని పరిశీలించారు. జాతీయ రహదారి పనులు చేస్తున్న కాంట్రాక్టర్, సిబ్బంది సహాయంతో ఆ గండిని పూడ్చివేశారు.

విరిగిపడిన కొండ చరియలు

శృంగవరపుకోట : శృంగవరపుకోట పంచాయతీలోని పుణ్యగిరి మెట్ల మార్గంలో ఆదివారం రాత్రి కొండ చరియలు విరిగిపడ్డాయి. ఆదివారం రాత్రి కురిసిన భారీ వర్షాలకు ఈ ఘటన చోటుచేసుకుంది. సోమవారం అధిక సంఖ్యలో భక్తులు ఉమా కోటిలింగేశ్వర స్వామి ఆలయానికి వెళ్లారు. ఆదివారం రాత్రి ఈ సంఘటన జరగడంతో పెనుప్రమాదమే తప్పింది. ఇప్పటికైనా కొండ చరియలు విరిగిపడకుండా ఇనుప వలలను ఏర్పాటు చేయాలని భక్తులు కోరుతున్నారు.

చెకుముకి టాలెంట్ టెస్టు పోస్టర్ ఆవిష్కరణ

పూసపాటిరేగ : జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యాన ఏటా నిర్వహిస్తున్న చెకుముకి సైన్స్ సంబరాల ద్వారా విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథం పెంపొందించడానికి దోహదపడుతుందని జెవివి జిల్లా సమతా కన్వీనర్ నిర్మల అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని కెజిబివి పాఠశాలలో జెవివి ఆధ్వర్యంలో జరిగే చెకుముకి టాలెంట్ టెస్ట్ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ నెల 25వ తేదిన జిల్లా వ్యాప్తంగా ఈ టెస్టులు జరుగనున్నాయన్నారు. అక్టోబర్ 1న మండల స్థాయి, 27న జిల్లా స్థాయిలో ఉంటాయన్నారు. జిల్లాలో విజేతలను నవంబర్ 9, 10 తేదీల్లో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు. ఈనెల 25న పాఠశాల స్థాయిలో నిర్వహించనున్న చెకుముకి సైన్సు సంబరాల్లో జిల్లాలోని అన్ని యాజమాన్యాల ఉన్నత పాఠశాలల్లోని వేల మంది విద్యార్థులు హాజరు కానున్నట్లు తెలిపారు. ఆమెతో పాటు కెజిబివి ఎస్ఒ ఎ. భారతి ఉన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయినికి సత్కారం

బొబ్బిలి : స్థానిక ఎన్‌జిఒ హోంలో జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ గ్రహీత ఎన్.రమేష్‌ను ఎపిటిఎఫ్ ఆధ్వర్యాన సోమవారం సత్కరించారు. ఎపిటిఎఫ్ రాష్ట్ర అకడమిక్ కన్వీనర్ జె.సి.రాజు, జోగినాయుడు, ప్రవీణ్ కుమార్, శ్రీరామ్మూర్తి, రమేష్, లక్ష్మణ రావు ఎల్లయ్య, రామకృష్ణ పాల్గొన్నారు.

మహిళా రైతులకు యాంత్రీకరణపై అవగాహన

నెల్లిమర్ల : మహిళా రైతులకు వ్యవసాయ యాంత్రీకరణపై సోమవారం సతివాడలో డాక్టర్ రెడ్డిస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ రెడ్డిస్ ఫౌండేషన్ సమన్వయ కర్త శ్రీనివాసరావు మాట్లాడుతూ వ్యవసాయ యాంత్రీకరణ పెరుగుతున్న నేపథ్యంలో మహిళా రైతులు ముందుకు రావాలని కోరారు. వరి సాగులో ఎద పద్ధతిలో నాటితే 6వేల వరకు ఖర్చు తగ్గుతుందని చెప్పారు.

రైతు సమస్యలపై నిరసనలు

ప్రజాశక్తి-గంట్యాడ

రైతుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఎపి రైతుసంఘం ఆధ్వర్యాన సోమవారం తహశీల్దార్ కార్యాలయాల వద్ద నిరసనలు చేపట్టారు. అందులో భాగంగా గంట్యాడ తహశీల్దార్ కార్యాలయం వద్ద ఎపి రైతుసంఘం జిల్లా కార్యదర్శి బి.రాంబాబు ఆధ్వర్యాన రైతులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా రాంబాబు మాట్లాడుతూ రైతులకు పెట్టుబడి సాయం రూ.20 వేలు వెంటనే ఇవ్వాలన్నారు. ఉచిత పంటల బీమా అమలు చేయాలని, రూ.2 లక్షల వరకు రైతుల రుణాలు మాఫీ చేయాలని డిమాండ్ చేశారు. వ్యవసాయ మోటార్లకు మీటర్లు పెట్టొద్దని, జిఒ 22ను రద్దు చేయాలని కోరారు. భూయజమాని సంతకంతో నిమిత్తం లేకుండా కౌలుదారులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలని, అన్ని రకాల రైతు సంక్షేమ పథకాలు వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. గ్రీన్‌ఫీల్డ్ హైవేలో భూములిచ్చిన రైతులకు 2013 చట్ట ప్రకారం పరిహారం చెల్లించాలని, పోలాకుల సర్వీసు రోడ్డు వేయాలని కోరారు. కార్యక్రమంలో రైతుసంఘం మండల అధ్యక్షులు కె.శ్రీను, కార్యదర్శి ఎస్.రవిరాజు, నాయకులు గంగునాయుడు, బంగారు నాయుడు, సూర్యదేముడు, జి.ఎర్రన్నాయుడు, కోటి, పైడినాయుడు, తదితరులు పాల్గొన్నారు.

శృంగవరపుకోట : పట్టణంలోని తహశీల్దార్ కార్యాలయం వద్ద ఎపి రైతుసంఘం ఆధ్వర్యాన ధర్నా నిర్వహించారు. అనంతరం తహశీల్దార్ అరుణకుమారికి వినతిపత్రాన్ని అందజేశారు. ఎపి రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి మద్దిల రమణ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం రైతులకు, కౌలు రైతులకు ఇచ్చిన హామీలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు కండిపల్లి రామారావు, గేదెల బంగారయ్య, కె.రామకృష్ణ, కె.సుంకరయ్య, జి.అచ్చిమ్మ, ఒంటి దేవుడు, జి.బంగారుబాబు, ఒంటి పైడితల్లి, జి.లక్ష్మణ్, జి.బంగారయ్య, జి.అప్పలనాయుడు, ఆర్.వెంకట్రావు, జి.ఎరుపునాయుడు పాల్గొన్నారు.

మెంటాడ : స్థానిక మండల తహశీల్దార్ కార్యాలయం ఎదుట కౌలు రైతుల సంఘం జిల్లా కార్యదర్శి రాకోటి రాములు ఆధ్వర్యంలో రైతులు ధర్నా చేపట్టారు. ప్రభుత్వ భూములను సాగుచేసుకుంటున్న పేదలకు పట్టాలు ఇవ్వాలని ఆయన కోరారు. గుర్లగెడ్డ ప్రాజెక్టుకు అదనపు నిధులు మంజూరు చేయాలని రాములు డిమాండ్ చేశారు. అనంతరం తహశీల్దార్ కె.శ్రీనివాసరావుకు వినతి అందించారు. కార్యక్రమంలో డి.సింహాచలం, రాకోటి అప్పారావు, పెంటాలి రాములమ్మ తదితరులు పాల్గొన్నారు.

గంట్యాడ : నిరసన తెలుపుతున్న రైతులు

జామి : రైతుల సమస్యలను పరిష్కరించాలని ఎపి రైతు సంఘం ఆధ్వర్యంలో సోమవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. రైతుసంఘం జిల్లా కార్యదర్శి బి.రాంబాబు మాట్లాడుతూ భీమసింగి చక్కెర కర్మాగారం ఆధునీకరించి తెరిపించాలన్నారు. ఎన్ఎస్ఎల్ షుగర్స్‌ను ప్రభుత్వమే నడిపించాలన్నారు. రైతు సేవా కేంద్రాల్లో యూరియా, పొటాష్ ఎరువులను అందుబాటులో ఉంచాలని డిమాండ్ చేశారు. అనంతరం తహశీల్దార్ ఐ.కృష్ణలతకు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎపి రైతుసంఘం జిల్లా కోశాధికారి రాయవరపు సత్యం, కౌలు రైతుల సంఘం జిల్లా సహాయ కార్యదర్శి కె.నారాయణరావు, రవి, చలుమూరి వెంకటరావు, చుక్క రామకృష్ణ, సిరికి వెంకట సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఇళ్లు కట్టిన పేదలకు పట్టాలు మంజూరు చేయాలి

ప్రజాశక్తి- రేగిడి

మండలంలోని పెద్దశిర్లాం గ్రామంలో 1986లో దళిత కాలనీలో సుమారు 50 కుటుంబాలకు ప్రభుత్వం ఇళ్ల నిర్మాణాలు చేపట్టిందని, వారికి తక్షణమే పట్టాలు ఇచ్చి ఆదుకోవాలని సిపిఎం జిల్లా కార్యదర్శి తమ్మినేని సూర్యనారాయణ డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద సిపిఎం నాయకులు, దళితులతో ధర్నా నిర్వహించారు. 36 సంవత్సరాలు క్రితం ప్రభుత్వం నిర్మించి ఇల్లు శిథిలావస్థకు చేరాయని పునర్నిర్మాణానికి ప్రభుత్వ హౌసింగ్ స్కీమ్ ద్వారా లోను అడిగితే ఇంటి పట్టాలు చూపించమని అడుగుతున్నారని చెప్పారు. అయితే ప్రభుత్వం తమకు ఇంత వరకూ పట్టాలివ్వకపోవడంతో ఇబ్బంది పడుతున్నారని చెప్పారు. శిథిలావస్థకు చేరిన ఇల్లును దళితులు, పేదలైన బిసిలు నిర్మించుకునే స్తోమత లేక ఇబ్బంది పడుతున్నారని ప్రభుత్వం కట్టించి నివాసముంటున్న దళితులు, బీసీలకు పట్టాలు ఇచ్చి ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ రాజాం నియోజకవర్గం నాయకులు పోరెడ్డి విశ్వనాథం, యం. త్రినాధ్, వి. తిరుపతిరావు, సిపిఎం పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు పి. శంకర్రావు, టివి రమణ తదితరులు పాల్గొన్నారు.

ధర్నాలో మాట్లాడుతున్న సిపిఎం నాయకులు తమ్మినేని

తల్లీబిడ్డల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి : జెసి

ప్రజాశక్తి-విజయనగరం కోట

తల్లీ బిడ్డ ఆరోగ్యంపై ప్రత్యేకంగా దృష్టి పెట్టాలని జాయింట్ కలెక్టర్ సేతు మాధవన్ తెలిపారు. పౌష్టికాహార మాసోత్సవంలో భాగంగా పోషణ్ అభియాన్ కార్యక్రమాన్ని ఐసిడిఎస్ ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్ ఆడిటోరియంలో నిర్వహించారు. జెసి మాట్లాడుతూ జిల్లాలో ఎక్కువ కార్యక్రమాలను నిర్వహించి రాష్ట్రంలో మొదటి స్థానంలో ఉన్నందుకు ఆ శాఖ అధికారులను, సిబ్బందిని అభినందించారు. అమ్మపేరుతో మొక్కను నాటే కార్యక్రమంలో భాగంగా సుమారు 13 వేల మొక్కల్ని నాటడం విశేషమన్నారు. రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ చైర్మన్ కేసలి అప్పారావు మాట్లాడుతూ ప్రతీ బిడ్డ ఆరోగ్యంగా ఉండాలని తెలిపారు. అనంతరం జిల్లా బాలల కమిషన్ చైర్‌పర్సన్ హిమ బిందు, స్టాండింగ్ కమిటీ చైర్‌పర్సన్ శాంతకుమారి మాట్లాడారు. అనంతరం బాలికలకు పౌష్టికాహారంపై నిర్వహించిన పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. 18 మంది గర్భిణులకు సీమంతాలు చేశారు. ఆరోగ్య బాలల ప్రదర్శన, అన్నప్రాసన కార్యక్రమాలను నిర్వహించారు. ఐసిడిఎస్ పీడీ శాంతకుమారి, పౌర సరఫరాల జిల్లా మేనేజర్ కె.మీనాకుమారి, డిఎస్ఒ మధుసూదనరావు, ఉద్యాన శాఖ అధికారి జమదగ్ని, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులతో ప్రిన్సిపాల్ ఉషారాణి, ఉపాధ్యాయులు

క్రీడల్లో సత్తాచాటిన గురుకుల విద్యార్థులు

వేపాడ : స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యాన మండల స్థాయిలో నిర్వహించిన క్రీడా పోటీల్లో గురుకుల విద్యార్థినులు సత్తాచాటారు. చెస్‌లో నవ్య, కబడ్డీలో దీపిక, మహేశ్వరి, అనూష, కోమలి, యోగాలో ఆరుగురు, వాలీబాల్‌లో ఏడుగురు, అథ్లెటిక్స్‌లో ఎనిమిది మంది ప్రతిభ కనబరిచి, నియోజకవర్గ స్థాయి పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపల్ యు.ఉషారాణి తెలిపారు.

డ్రాపౌట్ల విద్యాభివృద్ధికి తోడ్పాటు

ప్రజాశక్తి-కొత్తవలస

డ్రాపౌట్ల విద్యాభివృద్ధికి తోడ్పాటు అందించాలని సార్వత్రిక విద్యాపీఠం రాష్ట్ర పరిశీలకులు జి.గోపీకృష్ణ తెలిపారు. సోమవారం జెడ్‌పి హైస్కూలును ఆయన సందర్శించారు. దూరవిద్య కోర్సుల వల్ల డ్రాపౌట్లకు కలిగే ప్రయోజనాలు తెలియజేశారు పాఠశాల విద్యకు దూరంగా ఉన్న 14 ఏళ్లు నిండిన వారు కచ్చితంగా పదో తరగతి దూరవిద్య ద్వారా పూర్తి చేయాలన్నారు. పదో తరగతి చదివి పని చేసుకుంటున్న వారు ఇంటర్ ఒక్క ఏడాదిలోనే ఉత్తీర్ణులు కావచ్చని, దాని ద్వారా ఉన్నత విద్య, ఉపాధి అవకాశాలు పొందవచ్చని తెలిపారు. ఈ నెల 28 వరకు అడ్మిషన్లకు గడువు ఉందని, 29, 30 తేదీల్లో 200 రూపాయలు అపరాధ రుసుంతో చెల్లించవచ్చని తెలిపారు. కార్యక్రమంలో హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు చీపురుపల్లి ఈశ్వరరావు, సార్వత్రిక విద్య జిల్లా సమన్వయకర్త శివ ప్రకాశ్, మండల సమన్వయ అధికారి బి.గోవింద నాయుడు పాల్గొన్నారు.

పాఠశాలల సందర్శన

వేపాడ : మండలంలోని బికెఎస్ పేట, డిఆర్ పేట, కరకవలస ప్రాథమిక పాఠశాలలను సోమవారం ఎంఇఒలు జగదీశ్వరరావు, బాల భాస్కర్‌రావు సందర్శించారు. పాఠశాల ఆవరణ, తరగతి గదులు, టాయిలెట్స్, విద్యార్థుల వర్క్ బుక్స్, డైరీలు, మధ్యాహ్న భోజనం పరిశీలించారు.

మహిళలపై దాడులను అరికట్టాలి

శృంగవరపుకోట : మహిళలపై దాడులు, అఘాయిత్యాలు జరగకుండా ప్రభుత్వాలు కఠిన చట్టాలు తీసుకోవాలని ఎస్‌ఎఫ్‌ఐ గర్ల్స్ కోకన్వీనర్ భారతి డిమాండ్ చేశారు. దేవిబొమ్మ కూడలిలో ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో విద్యార్థినులు వీధి నాటకాన్ని ప్రదర్శించారు. కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా ఉపాధ్యక్షులు వి చిన్నబాబు, జిల్లా జాయింట్ సెక్రెటరీ రమేష్, జిల్లా కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

శత శాతం ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయాలి : కమిషనర్

ప్రజాశక్తి-విజయనగరంటౌన్

మన ఇల్లు మన గౌరవం నినాదంతో శతశాతం ఇళ్ళ నిర్మాణాలు పూర్తయ్యేలా కృషి చేయాలని ఎఇలకు, ఎమ్యునిటీ కార్యదర్శులకు కమిషనర్ నల్లనయ్య ఆదేశించారు. సోమవారం తన ఛాంబర్‌లో ఎఇలు, ఎమినిటీస్ కార్యదర్శులతో గృహ నిర్మాణాలపై సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విజయనగరం నగర పరిధిలో గుంకలాం, కొండకరకాం ప్రాంతాల్లో ఇళ్ల నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేసేందుకు కృషి చేస్తున్నామన్నారు. ఇందులో భాగంగా ఈనెల 28న లేఅవుట్ వద్ద పెద్ద ఎత్తున లబ్ధిదారులకు అవగాహన సదస్సు ఏర్పాటు చేస్తున్నామన్నారు. మార్చి 2025 నాటికి శతశాతం ఇళ్ళ నిర్మాణాలే లక్ష్యంగా కృషి చేస్తున్నామని తెలిపారు.

వినతులు స్వీకరించిన కమిషనర్

నగరపాలక సంస్థ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి ప్రజల నుంచి 8 వినతులు వచ్చాయి. ఆయా వినతులను సంబంధిత విభాగాల అధికారులకు అందజేసి సమస్యల సత్వర పరిష్కారానికి చొరవ చూపాలని కమిషనర్ పి. నల్లనయ్య ఆదేశించారు. ఇబ్బందులు ఉన్న నగరవాసులు వినతులను ప్రతిసోమవారం నిర్వహించే ఈ కార్యక్రమాలు సమర్పించవచ్చని తెలిపారు. కార్యక్రమంలో ఇఇ కె. శ్రీనివాసరావు, ఎసిపి అమ్మాజీ రావు, ఆర్ఒ శ్రీనివాసరావు, ప్రజారోగ్య అధికారి డాక్టర్ కొండపల్లి సాంబమూర్తి, మేనేజర్ ప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.

పోక్సో కేసులో నిందితుడికి 20 ఏళ్ల జైలు

ప్రజాశక్తి-విజయనగరంకోట

జిల్లా మహిళా పోలీసు స్టేషనులో 2023లో నమోదైన పోక్సో కేసులో నిందితుడు పూసపాటిరేగ మండలం పెద పతివాడ గ్రామానికి చెందిన కలిశెట్టి ఉమా మహేశ్వరరావు(23)కు పోక్సో ప్రత్యేక న్యాయమూర్తి కె.నాగమణి 20ఏళ్ల జైలు శిక్ష, రూ.7వేలు జరిమానా విధిస్తూ సోమవారం తీర్పు చెప్పారు. ఈమేరకు ఎస్‌పి వకుల్ జిందాల్ ఒక ప్రకటనలో తెలిపారు. పెద పతివాడ గ్రామానికి చెందిన కలిశెట్టి ఉమా మహేశ్వరరావు అదే గ్రామానికి చెందిన ఒక మైనరు బాలికను ప్రేమ పేరుతో వెంటపడి, లైంగికంగా వేధింపులకు గురి చేశాడు. బాలిక ఒంటరిగా ఉన్న సమయంలో ఆమెపై లైంగిక దాడికి పాల్పడినట్లుగా బాలిక తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు విజయనగరం మహిళా పోలీసు స్టేషనులో పోక్సో చట్టం ప్రకారం కేసు నమోదు అయ్యింది. నేరం రుజువు కావడంతో నిందితుడికి జైలు శిక్ష విధిస్తూ న్యాయమూర్తి తీర్పు వెల్లడించారు.

బ్యాటరీ దుకాణంలో యాసిడ్ లీక్

రాజాం : పట్టణంలోని కస్పా వీధిలో ఓ బ్యాటరీ దుకాణంలో యాసిడ్ లీక్ అవ్వడంతో ఆదివారం రాత్రి ఒక్కసారిగా అగ్నితో పాటు దట్టమైన పొగలు కమ్ముకున్నాయి. విషయం తెలుసుకున్న రాజాం అగ్నిమాపక సిబ్బంది హుటా హుటిన ఘటన స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు. దుకాణంలో 20 యాసిడ్ సీసాలు ఒకదాని మీద ఒకటి పెట్టడంతో ఈ ప్రమాదం సంభవించినట్లు అగ్నిమాపక సిబ్బంది తెలిపారు. ఒక్కసారిగా మంటలు చెలరేగడంతో స్థానిక ప్రజలు ఆందోళన వ్యక్తం చేశారు. రాజాంలో గతంలో పెనుబాక ఆయిల్ మిల్లు, నేడు బ్యాటరీ షాప్‌లలో తరుచు ప్రమాదాలు జరుగుతున్నా ఇండస్ట్రీ సేఫ్టీ అధికారులు పట్టించుకోవడంలేదని ప్రజలు విమర్శిస్తున్నారు.

నోటీస్
(OR. XXI RULE 58)
మహారాజశ్రీ బొబ్బిలి సీనియర్ సివిల్ జడ్జ్‌వారి కోర్ట్‌లో
E.P. 14/2020: O.S. 50/2010

తాళ్ళపూడి రామారావు ....డిక్రీ హోల్డర్
ఊణ్ణ కళావతి (died) వగైరాలు.
.....జడ్జిమెంట్ డెటోర్స్
టు
ఊణ్ణ నాగమణి, వయస్సు 34 సం॥, డాటర్ ఆఫ్ మన్మధ రావు, చిన్నబజార్ వీధి, బొబ్బిలి, విజయనగరం జిల్లా.

డిక్రీ హోల్డర్ తన డిక్రీ బకాయి రాబట్టే నిమిత్తము దాఖలు చేసిన పై నెంబర్ అమలు **తే. 30.09.2024 దీ** ని వాయిదా అయి ఉన్నది. ఆ దినము మీరు శ్రీ కోర్టు వారి యెదుట **ఉదయం 10.30 ని.** లకు స్వయము గా గాని, మీ అధీకృత ఏజెంట్ ద్వారా గాని హాజరై మీ వాదన దాఖలు చేసుకోగలరు. లేనియెడల మీ పరోక్షమున పై అమలు పరిష్కరించబడును.

(శ్రీ కోర్టువారి ఆదేశములతో)

తిరుపతి పాణిగ్రాహి
వాదితరపు న్యాయవాది
బొబ్బిలి

బొబ్బిలి
తేది: 24.09.2024

గ్రామాల అభివృద్ధే లక్ష్యం : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - నెల్లిమర్ల

ఎమ్మెల్యే మాధవిని సన్మానిస్తున్న టిడిపి నాయకులు

గ్రామాల అభివృద్ధే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తుందని ఎమ్మెల్యే లోకం నాగ మాధవి తెలిపారు. సోమవారం మధుపాడలో నాబార్డ్ నిధులు రూ.2.90కోట్ల అంచనా విలువతో మధుపాడ నుంచి జోగిరాజు పేట, అలుగోలు మీదుగా రాగోలు వరకు రహదారి నిర్మాణ పనులను ఎమ్మెల్యే మాధవి, ఎమ్మెల్సీ డాక్టర్ పి సురేష్ బాబు సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాధవి మాట్లాడుతూ గ్రామాలకు రహదార్లు, తాగునీటి సౌకర్యాలకు ప్రాధాన్యతనిస్తున్నా మన్నారు. అనంతరం మధుపాడ సర్పంచ్ నల్లం అప్పారావు, తెలుగు యువత మండల అధ్యక్షులు నల్లం శ్రీనివాసరావు ఎమ్మెల్యేను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి అంబళ్ల సుధారాణి, జనసేన నాయకులు చనమల్ల వెంకట రమణ, అంబళ్ల అప్పల నాయుడు, యడ్ల గోవింద రావు తదితరులు పాల్గొన్నారు.

మెట్టపల్లి అంగన్వాడీ టీచర్ మృతి

ప్రజాశక్తి- చీపురుపల్లి

మండలంలోని మెట్టపల్లి గ్రామానికి చెందిన అంగన్వాడీ కార్యకర్త జె.పద్మలత (53) అనారోగ్యంతో సోమవారం మృతి చెందారు. మెట్టపల్లి గ్రామంలోని అంగన్వాడి వన్ సెంటర్లో ఆమె కార్యకర్తగా విధులు నిర్వహిస్తున్నారు. గత కొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న పద్మలత చికిత్స కోసం హైదరాబాదులోని తన కుమారుని ఇంటి వద్దకు వెళ్లారు. చికిత్స జరుగుతుండగా ఆరోగ్యం సహకరించకపోవడంతో సోమవారం మృతి చెందినట్లు స్థానిక ఐసిడిఎస్ అధికారులు వెల్లడించారు. ఆమెకు ఒక కుమార్తె ఒక కుమారుడు ఉన్నారు. పద్మలత మృతి పట్ల స్థానిక సిబ్బంది కార్యకర్తలతో పాటు యూనియన్ నాయకులు సంతాపం తెలిపారు.

నీటిని వృథా చేయొద్దు : డిఇ

ప్రజాశక్తి - నెల్లిమర్ల

నీటిని వృథా చేయరాదని గ్రామీణ నీటి సరఫరా విభాగం డిఇ బి. ఉమా శంకర్ అన్నారు. సోమవారం సారిపల్లిలో స్వచ్ఛత హి సేవా కార్యక్రమంలో భాగంగా వర్షపు నీరు నిల్వ, ఇంకుడు గుంతల నిర్మాణంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నీటిని ఒడిసి పట్టుకోవాల్సిన బాధ్యత అందిరీపైనా ఉందన్నారు. జిల్లా ప్రజారోగ్య శాఖ ఈఈ కె. దక్షిణా మూర్తి మాట్లాడుతూ భావి తరాలకు నీటి సమస్య లేకుండా పొదుపుగా వాడాలన్నారు. ఈ కార్యక్రమంలో సూక్ష్మం నీటి వనరులు పీడీ పిఎన్‌వి లక్ష్మీ నారాయణ, ఎంపిడిఒ జి. గిరిబాల, ఆర్‌డబ్ల్యూఎస్ ఎఇ షేఖ్ భాషా, పంచాయతీ సెక్రటరీ బి. భవాని తదితరులు పాల్గొన్నారు.

ఇంటి స్థలాలు కేటాయించండి

ప్రజాశక్తి - భోగాపురం

న్యాయస్థానం ఇచ్చిన ఆదేశాల మేరకు ఇంటి స్థలాలు కేటాయించాలని చెరుకుపల్లి గ్రామానికి చెందిన మహిళలు తహశీల్దార్ ఎం.సురేష్‌ను సోమవారం కోరారు. 2019లో పట్టాలు ఇచ్చినప్పటికీ స్థలాలు ఇవ్వలేదని తెలిపారు. ఇటీవల ఎన్నికలకు ముందు 12 మంది న్యాయస్థానాన్ని ఆశ్రయించగా వారికి స్థలాలు ఇవ్వాలని ఆదేశించినట్లు తెలిపారు. ఇప్పటికి ఇవ్వకపోతే కోర్టు దిక్కారణ కేసు కింద మళ్ళీ న్యాయస్థానానికి వెళతామని చెప్పారు. తహశీల్దార్ స్పందిస్తూ ఈ సమస్యను వెంటనే పరిష్కరించే విధంగా చర్యలు చేపడతామని వారికి హామీ ఇచ్చారు. నాయకులు తోగులరెడ్డి, రిక్క నర్సింగరావు, తాటిపూడి ఉదయ్, తుపాకుల గురుమూర్తి, రిక్క ఆదినారాయణ, తోగులు రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గడ్డిమందు తాగి వ్యక్తి ఆత్మహత్య

రామభద్రపురం : ముచ్చర్లవలస గ్రామానికి చెందిన టి.సూర్యనారాయణ (50) గడ్డి మందు తాగి ఆత్మహత్య చేసుకున్నట్టు ఎస్ఐ ప్రసాద్ తెలిపారు. మద్యానికి బానిసై కుటుంబ తగాదాల నేపథ్యంలో మనస్తాపం చెంది ఈ నెల 22న గడ్డిమందు తాగడంతో బంధువులు బాడంగి సిహెచ్‌సికి తరలించారు. అక్కడ ప్రాథమిక చికిత్స అందించి మెరుగైన వైద్యం కోసం జిల్లా కేంద్రాసుపత్రికి తరలించారు. సోమవారం తెల్లవారుజామున ఆయన మరణించాడు. సూర్యనారాయణకు కుమార్తె సాయిలక్ష్మి, కుమారుడు సాయికిరణ్ ఉన్నారు. భార్య కళావతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

గోడ కూలి వ్యక్తికి తీవ్ర గాయాలు

రామభద్రపురం : రావివలస పంచాయతీలోని మూలశెలగాం గ్రామానికి చెందిన కారంగి లక్ష్మణరావు ఇంటి గోడ వర్షాలకు తడిసి కూలిపోయింది. సోమవారం ఇంట్లో లక్ష్మణరావు టీ తాగుతుండగా ఒక్కసారిగా గోడ కూలిపోవడంతో ఆయన తలకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే ఆయన్ను బాడంగి సిహెచ్‌సికి తరలించి, ప్రాథమిక వైద్యం అందించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం విశాఖ కెజిహెచ్‌కు తరలించారు.

మద్యం తరలిస్తున్న వ్యక్తి అరెస్టు

బాడంగి : అక్రమంగా మద్యం తరలిస్తున్న వ్యక్తిని సోమవారం పోలీసులు అరెస్టు చేశారు. మండలంలోని బొత్సవానివలసకు చెందిన ఎ.సత్యనారాయణ 43 మద్యం బాటిళ్లను తరలిస్తుండగా మల్లంపేట సమీపంలో పోలీసులు పట్టుకున్నారు. మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు. ఆయన్ను రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ తారకేశ్వరరావు తెలిపారు.

గల్లంతైన రైతు మృతదేహం లభ్యం

జామి : గోస్తనీనదిలో ఆదివారం ప్రమాదవశాత్తూ గల్లంతైన జామికి చెందిన రైతు కొత్తలి దేముడు (64) మృతదేహం సోమవారం బయట పడింది. ఆదివారం రాత్రి నుంచి పోలీసులు, రెవెన్యూ సిబ్బంది గాలింపు చర్యలు చేపట్టారు. సోమవారం శృంగవరపుకోట నుంచి అగ్నిమాపక సిబ్బందిని తహశీల్దార్ ఐ.కృష్ణలత, ఎఎస్ఐ రాజాన నర్సింగరావు రప్పించి నదిలో గాలింపు చర్యలు చేపట్టారు. మరోవైపు మాజీ జెడ్‌పిటిసి బండారు పెదబాబు తన అనుచరులతో గాలింపు నిర్వహించారు. నది ప్రవాహం ఎక్కువ కావడంతో ఎంతసేపు వెతికినా ఫలితం లేకపోయింది. దీంతో ఎస్‌డిఆర్ఎఫ్ బృందానికి తహశీల్దార్ సమాచారమిచ్చారు. సాయంత్రం ఈ బృందం వస్తుందనే సమాచారం అందింది. కానీ ఇంతలో కొత్తలి దేముడు మృతదేహం నీటిపైకి తేలింది. ఇది గుర్తించిన స్థానికులు వెంటనే మృతదేహాన్ని ఒడ్డుకు చేర్చారు. అనంతరం శవ పంచనామా నిర్వహించి, పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. దేముడుకు భార్య లక్ష్మి ఉంది.

వేలం ప్రకటన
మహారాజశ్రీ రాజాం జూనియర్ సివిల్ జడ్జివారి కోర్టులో
EP 26/2023, OS 18/2021

DHR/ వాది : శింగుపురపు ఆదినారాయణ
JDR/ ప్రతివాది : గంగిరెడ్డి పెంటారావు

పై నెంబరు అమలులో ఈ క్రింది అమలు షెడ్యూలు దాఖలా ఆస్తి **తే 16-10-2024దిని ఉదయం 10-30 గంటల నుండి సాయంత్రం 5-00 గంటలు** మధ్య పై కోర్టువారి ఎదుట వేలం జరుగును. కావలసిన వారు వేలం పాడుకోవలసిందిగా యీ ప్రకటన మూలంగా కోరడమైనది.

షెడ్యూలు :-
శ్రీకాకుళం జిల్లా (ప్రస్తుతం విజయనగరం జిల్లా) సంతకవిటి మండలం, తలతంపర గ్రామం పట్టా నెంబరు 396 సర్వే నెంబరు 91-3, యం॥ 0-15 శెంట్లు భూమికి హద్దులు.
తూ॥ :- గంగిరెడ్డి క్రిష్ణ భూమి, ద॥ :- కాలువ
ప॥ :- గంగిరెడ్డి ఆదినారాయణ భూమి
ఉ॥ :- గంగిరెడ్డి క్రిష్ణ భూమి
DHR విలువ రూ॥ 2,00,000/-లు
అమీను గారి విలువ రూ॥ 3,00,000/-లు
JDR కు విక్రయపు హక్కు కలదు.
ఈ వేలం ఆస్తిపైని ఎట్టి తనఖాలు గాని, జప్తులు చర్యలు గాని లేవు.

శ్రీ ఎ.సత్యనారాయణ గారు
అడ్వకేటు, రాజాం,
సెల్ : 9949176936

పత్రికా ప్రకటన నోటీసు
మహారాజశ్రీ గజపతినగరం జూనియర్ సివిలు జడ్జివారి కోర్టులో
I.A. 167/2024 in O.S.48/2017

బిట్వీన్ :
కొల్లి రామునాయుడు (died) మరియు ఇతరులు
.....పిటీషనర్సు/వాదులు
మరియు :
కొల్లి రామమూర్తి (died) మరియు 6 గురు
......రెస్పాండెంట్లు/ప్రతివాదులు
To
R5. శ్రీమతి కొల్లి సింహాచలం W/o లేటు రామమూర్తి, హిందూ, 64సం॥, గృహకృత్యయులు, పోలవంగర గ్రామం, దత్తిరాజేరు మండలం, విజయనగరం జిల్లా.
R6. శ్రీ కొల్లి అప్పారావు S/o లేటు రామమూర్తి, హిందూ, 45సం॥, వ్యవసాయం, పోలవంగర గ్రామం, దత్తిరాజేరు మండలం, విజయనగరం జిల్లా.

పై దావాలో వాది దావా పరిహారం సవరణలు చేయు నిమిత్తం అనుమతి కోరుచూ కోర్టువారి ఎదుట పై నెంబరు పిటిషను దాఖలు చేయుటయు, కోర్టువారు మీకు పలుమార్లు నోటీసులను పంపినప్పటికీ మీరు సదరు నోటీసులను తప్పించుకొని తిరుగుచున్నందున శ్రీ కోర్టువారు పత్రికా ప్రకటన ద్వారా నోటీసులు జారీ చేయుటకు ఆదేశములు యిచ్చుచూ పై పిటిషనను తే01-10-2024దీ నాటికి వాయిదా వేసియున్నారు. కావున యిరువురూ **తే 01-10-2024దీన ఉదయం 10-30గంటల**కు పై కోర్టువారి యెదుట హాజరై మీ వాదనను స్వయముగా గాని, లేక మీ న్యాయవాది ద్వారాగాని దాఖలు చేసుకొనవలయును. అందుకు తప్పిన యెడల శ్రీ కోర్టువారు మీ పరోక్షములో తదుపరి ఉత్తర్వులు గైకొందురని యిందు మూలముగా తెలియజేయడమైనది.

బిట్రా సూర్యారావు
వాదులు తరుపు న్యాయవాది
గజపతినగరం